## క్లుప్తంగా

### అమ్మవారికి పంచామృతాభిషేకాలు



సంపరలో విజయదుర్గ అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

**పెదపూడి:** సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గ అమ్మవారికి అమావాస్య శుక్రవారం సందర్భంగా పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. లలితాపారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

### కనక దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ తల్లి

**బిక్కవోలు:** ఊలపల్లి గ్రామంలోని కనక దుర్గమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అమావాస్య కావడంతో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### అమ్మవారికి ప్రత్యేక పూజలు



విజయ దుర్గాంబిక అమ్మవారు

**రంగంపేట:** గ్రామంలో మంచినీటి చెరువు వద్ద కొలువైన విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారుజామునే అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

### పౌష్టికాహార కిట్ల పంపిణీ



లబ్ధిదారులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న నేతలు

**బిక్కవోలు:** ప్రతి నెలా ప్రభుత్వం అందించే పౌష్టికాహార కిట్లను కొంకుదురు గ్రామంలో శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గర్భిణులు, బాలింతలకు మాజీ సర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి ఈ కిట్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యం



సరికుప్పల వీరన్న(ఫైల్)

**సీతానగరం:** మండలంలోని రఘుదేవపురానికి చెందిన 24 ఏళ్ల సరికుప్పల వీరన్న ఆచూకీ లేదని తండ్రి పూస బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. గత నెల 15న డ్రైవింగ్ లైసెన్స్ కోసం రాజమహేంద్రవరం వెళ్లిన వీరన్న ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఉపయోగం లేకపోయింది. ఈ మేరకు అతడి తండ్రి పూస బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**కడియం:** మండలంలోని దుళ్ల -1, 2 ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు వేలాది రూపాయల విలువైన నోటు పుస్తకాలను దాత కంటిపూడి కిరణ్‌కుమార్ అందజేశారు. ఈ మేరకు శుక్రవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యంత్రవోలు యంఎస్ మణికుమార్, వై. నాగేశ్వరరావు, దాత తండ్రి బాలకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఏటా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు, గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో కిరణ్‌కుమార్ తోడ్పడడంపై ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు గెద్దం ఆనంద్, శశి కుమారి, ఉపాధ్యాయులు గంపల పాపారావు, చల్లా వీర వెంకటేశ్వర్లు, అన్నే దొరబాబు, పడాల రాముడు, జి.ధనలక్ష్మి, బి.అబ్బాయి, ప్రమీల కుమారి, ఎస్‌ఎంసీ చైర్మన్ వీర బాబు పాల్గొన్నారు.

# కలుపే శిరోభారమాయెనె..

- నివారణ కీలకమంటున్న వ్యవసాయ నిపుణులు
- నియోజకవర్గంలో 45,500 ఎకరాల్లో వరి సాగు
- 65 శాతం మేర వరి నారుమడులు పూర్తి
- 10 శాతం పూర్తయిన వరినాట్లు



టీవీఆర్ మణిదీప్

**పెదపూడి:** నారుమడి యాజమాన్యంలో ప్రధానమైనది కలుపు నివారణ. ప్రస్తుతం సాగునీటి విడుదలతో రైతులు నారుమడులు ముమ్మరంగా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు నారుమడిలో కలుపు నివారణపై పెదపూడి మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ పలు సూచనలు చేస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో మొత్తం నాలుగు మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 45,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తిలో 12 వేల ఎకరాలు, పెదపూడిలో 18,500, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 65 శాతం మేర నారుమడులు తయారు చేశారు. బోర్లు, ఇంజిన్ల వద్ద నారుమడులు వేసిన పొలాల వద్ద నాట్లు వేస్తున్నారు. మిగిలిన చోట్ల అన్నదాతలు నారుమడుల తయారీలో నిమగ్నమయ్యారు. సుమారు 10 శాతం మేర వరి నాట్లు వేసినట్టు అంచనా.



పెదపూడిలో వేసిన నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ మణిదీప్, పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ మాధవి తదితరులు

**నారుమడిలో ఇలా..**

రెండు దశల్లో నారుమడిలో కలుపును నివారించవచ్చు. విత్తిన మూడు నుంచి ఐదు రోజుల్లో మడిలో నీరు పలచగా ఉన్నప్పుడు ఎకరం నారుమడికి 35 గ్రా. ఆక్సాడయార్జిల్ 80 శాతం పొడి మందును ముందుగా అర లీటరు నీటిలో కలిపి, ఆ ద్రావణాన్ని 20 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో సమానంగా చల్లాలి. మందు చల్లాక రెండు రోజుల వరకు నీరు పెట్టనవసరం లేదు. విత్తిన 15వ రోజున పొలంలో కేవలం ఊద మున్నగు గడ్డిజాతి మొక్కలు మాత్రమే ఎక్కువగా ఉంటే, ఎకరాకు 400 మి.లీ. సైహాలో ఫాప్ బ్యూటైల్ 10 శాతం ద్రావణం 200 మీ.లీ. నీటిలో(అనగా లీటర్ నీటికి రెండు మి.లీ. చొప్పున) కలిపి స్ప్రే చేయాలి. ఈ మందు స్ప్రే చేసిన వారం రోజుల్లో ఊద వంటి గడ్డి జాతి మొక్కలు మాత్రమే నశిస్తాయి. లేదా నారుమడిలో ఊద, ఇతర గడ్డి జాతి మొక్కలతో పాటు పిచ్చి మొక్కల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరా నారుమడికి 80 మి.లీ. బిస్ పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావణం 200 లీటర్ల నీటిలో (అనగా లీటరు నీటికి 0.4 మి.లీ. చొప్పున) కలిపి స్ప్రే చేయాలి. ఈ మందు పిచికారీ చేసిన వారం రోజుల్లో ఊదతో పాటు ఆకుజాతి మొక్కలు నశిస్తాయి.

**నారు మొలిచిన తర్వాత..**

నారుమడిలో నారు మొలిచిన 15వ రోజున గడ్డి జాతి మొక్కలు మాత్రమే ఉంటే ఎకరాకు 400 మి.లీ. సైహాలోఫాస్ బ్యూటైల్ 10 శాతం ద్రావణం 200 లీటర్ల నీటిలో(అనగా లీటరు నీటికి రెండు మి.లీ. చొప్పున) కలిపి స్ప్రే చేయాలి. గత ఆరేడేళ్లుగా రైతులు ఈ మందును ఊద వంటి గడ్డి జాతి మొక్కల నిర్మూలనకు వాడడం వల్ల కొన్ని ప్రాంతాల్లో గడ్డి జాతి ఉధృతి తగ్గి, వెడల్పాటి మొక్కలు ఎక్కువగా వస్తున్నట్టు కొందరు రైతుల అనుభవం, అటువంటి పరిస్థితుల్లో వరి నారుమడిలో అన్ని రకాల కలుపు మొక్కలు(ప్రత్యేకించి గడ్డి జాతి, వెడల్పాకు మొక్కలు) ఉన్నప్పుడు ఎకరా నారుమడికి 80 మి.లీ. బిస్ పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావణం 200 లీటర్ల నీటిలో (అంటే లీటరు నీటికి 0.4 మి.లీ. చొప్పున) కలిపి స్ప్రే చేయాలి. ఈ మందు స్ప్రే చేసిన వారం రోజుల్లో వరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కలుపు నిర్మూలన అవుతుంది.

**మగాణి భూముల్లో..**

వరి సాగులో మాగాణి నారుమళ్లలో వరితో పాటు సాధారణంగా ఊద ఎక్కువగా వస్తుంది. ఊదతో పాటు బొంత ఊద, ఊర్రంకి, తొండంగి, నక్షత్ర గడ్డి, తుంగ, ఆమడకాయ, పొన్నగంటికూర, బొక్కెన ఆకు, తూగికాడలు వంటివి వాటి ఆహారం కోసం వరి మొక్కలతో పోటీ పడతాయి. దీంతో వరి నారు పెరుగుదలను తగ్గించటమే కాక, పురుగులు, తెగుళ్లకు ఆశ్రయమిచ్చి వాటిని నారుమడి నుంచి నాటిన వరి పొలంలోకి వ్యాప్తి చేసి, తద్వారా నారును నాశనం చేస్తాయి. నారుమడిలో కలుపును నివారిస్తే నారు ఆరోగ్యంతో పాటు దృఢంగా పెరుగుతుంది. మరోవైపు నాటే పొలంలోకి కలుపు వ్యాపించకుండా అరికట్టవచ్చు.

### పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 సత్యనారాయణ

**పెదపూడి:** నేను బడికిపోతా.. కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో హాజరు నమోదు శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహించే ప్రార్థన కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందుగానే హాజరు కావాలన్నారు. విద్యార్థుల్లో పఠనా, లేఖనా నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. విద్యా ప్రవేశ్ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల వారు విధిగా అమలు చేయాలన్నారు. సెన్సస్ రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠశాల వారు మధ్యాహ్న భోజన పథకం మెనును అనుసరించి నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహించే ప్రదేశం, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

### మొక్కజొన్న రైతుల ధర్నా

**మధురపూడి:** కోరుకొండ మండలం కాపవరం వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం వద్ద హైబ్రీడ్ మొక్కజొన్న రైతులకు రావల్సిన బకాయిలు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బీకే మల్లికార్జునరావుకు వినతిపత్రం అందించారు. కంపెనీ ఆర్గనైజర్ హామీ మేరకు తుఫానుకు ముందు సాగు చేసిన పంట నష్టపోవడంతో మరలా తుఫాన్ అనంతరం కంపెనీ ఇచ్చిన విత్తనాలు సాగు చేశామని ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం కొనుగోలు చేసిన పంట ఉత్పత్తికి పూర్తిస్థాయిలో నగదును చెల్లించాలని రైతులు అన్నారు. ఈ కార్యక్రమంలో మునగాలకు చెందిన మొక్కజొన్న రైతులు గిద్దా వెంకట సత్యనారాయణ, మండపాక వెంకటరాజు, కొండపల్లి వీర్రాఘవులు, మండలపాక విష్ణుమూర్తి, కడెం యేసు పాల్గొన్నారు.

### 7న జగన్నాథ స్వామి రథయాత్ర

**సీటీఆర్ఐ:** ఈనెల 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభమవుతుందని ఇస్కాన్ రాజమండ్రి మందిర కమిటీ చైర్మన్ శివానంద నిమాయదాస్ చెప్పారు. ఇస్కాన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పూరీలో జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా జరుగుతుందన్నారు. ఇస్కాన్ మందిరంలోనూ జగన్నాథ స్వామి కొలువై ఉన్నారని ఇక్కడ కూడా ఏటా రథయాత్ర నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారని, జగన్నాథ స్వామి రథయా త్రలో మూలవిరాట్టును ఉంచుతారని ఆయన చెప్పా రు. మందిరానికి రానివాళ్ల కోసం స్వామి వారే స్వ యంగా బయటకు వచ్చి దర్శన భాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర ప్రత్యేకతగా శివానంద నిమాయదాస్ చెప్పారు. ఇస్కాన్ ఆంధ్రప్రదేశ్ జోనల్ సెక్రటరీ రేవతి రమణ్ ప్రభుజీ ముఖ్య అతిథిగా పాల్గొని, రథయాత్ర ప్రారంభిస్తారని తెలిపారు. కీర్తనలు, భజనల నడుమ శ్రీ జగన్నాథ బలదేవ సుభద్రల విగ్రహాలను రథంలో ఉంచుతామని, ఇస్కాన్ స్వామీజీలు, ముఖ్య అతిథుల సందేశాలు ఉంటాయని తెలిపారు. గోరక్షణ పేట, ఆజాద్ చౌక్, జాంపేట, ఊర్వశి సెంటర్, బీఈడీ ట్రైనింగ్ కాలేజీ, డీలక్స్ సెంటర్, హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర ఆలయం మీదుగా రథయాత్ర ఇస్కాన్ కి చేరడంతో ముగుస్తుందని శివానంద నిమాయదాస్ వివరించారు. రథయాత్రలో భక్త జనులు పాల్గొని జగ న్నాథ స్వామి అనుగ్రహం పొందాలని ఆయన కోరా రు. కమిటీ సభ్యులు రవీంద్ర చైతన్య దాస్ మాట్లాడుతూ రథయాత్రను ఒక్కో ఏడాది ఒక్కొక్క ప్రాంతం మీదుగా నిర్వహిస్తున్నామని గతేడాది కంబాల చెరువు నుంచి ప్రారంభించగా ఈసారి శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభిస్తున్నామని చెప్పారు. రథయాత్ర ముగిసాక జగన్నాథస్వామి లీలలపై ప్రవచనం, 56రకాల చొప్పున భోగ నైవేద్యం, దీప హారతులు, అనంతరం ప్రసాద వితరణ ఉంటాయని అయన వివరించారు. శ్యామాంగ శ్రీనివాస్ దాస్, హేమ నిమాయదాస్ సమావేశంలో పాల్గొన్నారు.

## డయేరియా అనుమానిత కేసుల గుర్తింపు



సీతానగరంలో పర్యటించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

**సీతానగరం:** డయేరియా లక్షణాలతో బాధపడుతున్న 13 మందిని సీతానగరంలో గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నామని డీఎమ్‌హెచ్‌వో కె వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సీతానగరంలో ఎపిడమిక్ సెల్ జిల్లా సర్వేలైన్స్ ఆఫీసర్ డాక్టర్ రాజీవ్, సుధీర్, జాన్సన్‌తో పాటు వివిధ శాఖాధికారులతో కలిసి డీఎమ్‌హెచ్‌వో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరంలో పదమూడు మంది డయేరియా లక్షణాలతో వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. నలుగురు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారని, సీతానగరం ప్రైవేట్ ఆసుపత్రిలో ముగ్గురు, పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య పర్యవేక్షణలో ఆరుగురు వైద్యసేవలు పొందుతున్నారని, వీరందరి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందన్నారు. పారిశుద్ధ్య, పరిరక్షణ చర్యల్లో భాగంగా సమన్వయ శాఖలతో కలిసి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సంక్రమణ మూలాన్ని గుర్తించడానికి నీటి నమూనాలు సేకరణ చేసి పరీక్షలు కోసం పంపించామన్నారు. ప్రతి రోజు ఇంటింటి సర్వేతోపాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్రిమిసంహారక, పారిశుద్ధ్యం, ఆరోగ్య విద్య, క్లోరినేషన్ పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పరిస్థితి అదుపులో ఉందని, జిల్లా యంత్రాంగం తరఫున అన్ని చర్యలు చేపట్టామని డీఎమ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఏవికె చైతన్య, ఇతర వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ ప్లస్ గ్రేడ్

**సీతానగరం:** స్థానిక సీతానగరం ప్రభుత్వ కళాశాలకు నాక్ టీమ్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సర్టిఫికెట్ అందించారని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 27, 28లో నాక్ టీమ్ కళాశాలలోని సమస్త సౌకర్యాలు పరిశీలించిన అనంతరం బీ ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను కేటాయించారన్నారు. బీ ప్లస్ ప్లస్ అత్యధిక స్కోరు 3.00 సీజీపీఏ కళాశాల సాధించిందన్నారు. గతంలో కళాశాలకు బీ గ్రేడ్ ఉందని, ప్రస్తుతం బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిందని, ఇది ఐదేళ్ల అమలులో ఉంటుందన్నారు. దీని వల్ల కళాశాలకు రూసా నుంచి నిధులు వస్తాయని తద్వారా అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు ఎస్కే మదీనా, డాక్టర్ నాగేశ్వరరావు, సుబ్బారావు, డాక్టర్ మాధవ్, వాణి, అలేఖ్య, మీనాక్షి, వెంకటేష్, ఫణి, ప్రసాద్, డాక్టర్ ఎమ్ సుధామయి పాల్గొన్నారు.

## మూడో పంటగా సజ్జ సాగు మేలు



కోటికేశవరంలో సజ్జ పంట యాజమాన్యంపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు

**రాజానగరం/మధురపూడి:** మూడో పంటగా సజ్జలను సాగు చేయడం వల్ల నాణ్యమైన, పోషక విలువలున్న చిరు ధాన్యాలను ఉత్పత్తి చేయడంతో పాటు, విలువ ఆధారిత ఉత్పత్తులను మార్కెటింగ్ చేసి, ఆర్థికాభ్యున్నతికి అవకాశం ఉంటుందని దివాన్ చెరువులోని, ఏరువాక కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా నరసింహారావు రైతులకు సూచించారు. కోరుకొండ మండలం కోటికేశవరంలోని ఆర్బీకే వద్ద సజ్జల్లో సమగ్ర పంట యాజమాన్యం పద్ధతులు అనే అంశంపై శుక్రవారం రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సార్వా, దాళ్వా వరి పంటల తర్వాత సజ్జలను సాగు చేయడం లాభదాయకమన్నారు. పెట్టుబడి తక్కువని, చీడపీడల బెడద కూడా పెద్దగా ఉండదని చెప్పారు. పోషక విలువలున్న చిరు ధాన్యాలను ఉత్పత్తి చేయవచ్చన్నారు.

ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి. అమ్మాజీ మాట్లాడుతూ తక్కువ నీటి తడులతో, ఎరువులతో ఆరోగ్యమైన పంటను పండించవచ్చన్నారు. తొలి దశలో కలుపు నివారణ, సమతుల్యమైన ఎరువులను వాడుతూ, కేవలం 2 లేదా 3 తడులతోనే పంట పొందవచ్చన్నారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. హైమజ్యోతి మాట్లాడుతూ వేసవి పంటగా దీనిని సాగు చేస్తే, 70 నుంచి 80 రోజుల్లోనే ఎకరాకు రూ.20 వేల వరకు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఏడీఏ బీకే మల్లికార్జునరావు మాట్లాడుతూ జిల్లాలో సజ్జ, కొర్రల వంటి పంటలపై రైతుల్లో అవగాహన కల్పించి, ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా సజ్జ పంటపై సాంకేతిక కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీ ఎ.జయరామలక్ష్మి, ఏఓ గౌరీదేవి, రైతులు పాల్గొన్నారు.

## సచివాలయాల నుంచే సేవలందించాలి



కాపవరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హేమసుందరరావు

**మధురపూడి:** గ్రామాల్లోని సచివాలయాల్లోని ఉద్యోగులందరూ సచివాలయాల నుంచే ప్రజలకు సేవలందించాలని కోరుకొండ ఎంపీడీఓ హేమసుందరరావు అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం కాపవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలోని ఉద్యోగులందరినీ సెక్రటరీ సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి తన శాఖకు సంబంధించిన రికార్డు క్షణ్ణంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రపర్చడం, తాగునీటిని క్లోరినేషన్ చేయడం బాధ్యతగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ శాఖ గ్రామస్థాయి అసిస్టెంట్లు రైతు-కూలీలకు సహకారాన్ని అందించాలన్నారు. వీఆర్వోలు రెవెన్యూ పరమైన బాధ్యతలను విస్మరించరాదన్నారు. అందరూ సచివాలయంలో ఉండి బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు పని విధానం సక్రమంగా లేకపోతే చర్యలుంటాయన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్‌పీడీ మహేశ్వర ప్రతాప్, సచివాలయం సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా

**సీతానగరం:** పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ హైందవ సైన్య మండల ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం రఘుదేవపురం రవీంద్ర కాలనీ వద్ద ఆందోళన చేసి, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని పునర్నిర్మిస్తాం

**సీతానగరం:** మిర్తిపాడు సెంటర్‌లో ధ్వంసమైన దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని కూటమి నాయకులతో చర్చించి పునర్నిర్మిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శుక్రవారం తెలిపారు. మిర్తిపాడు సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి కారుతో ఢీ కొట్టగా విగ్రహం విరిగింది. దీనిపై ఎమ్మెల్యే బలరామకృష్ణ మిర్తిపాడు టీడీపీ నాయకులతో చర్చించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని పోలీసుశాఖాధికారులను ఆదేశించారు.

## విద్యా సామగ్రి వితరణ

**కంబాలచెరువు:** స్థానిక దానవాయిపేట మున్సిపల్ స్కూల్లో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పలక, బలపం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు విద్యాసామగ్రిని శుక్రవారం అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయుడు రొబ్బి సన్యాసిరావు చేతులమీదుగా విద్యార్థులకు పలకలు, బలపాలు, ప్లాస్టిక్ బాక్సులు, ఆట వస్తువులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు నిర్మల్ కుమార్, ఉంగరాల ప్రభాకర్, కేబుల్ మూర్తి, అనిశెట్టి బాబీ, ప్రవీణ్ కుమార్, గేదెల శ్రీను పాల్గొన్నారు.

## 9న మోటార్ సైకిళ్ల వేలం

**రాజమహేంద్రవరం రూరల్:** స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్ పరిధిలో నాటుసారాయి, ఇతర నేరాలలో పట్టుబడిన ఆరు మోటార్ సైకిళ్లను ఈనెల 9న ఉదయం 8 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి ఆదేశాల మేరకు ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని సౌత్‌స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్‌కార్డు నకలుతో పాటు దరఖాస్తు రుసుము రూ.5వేలు జమ చేయాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వ్యక్తులు మొత్తం సొమ్ముతో పాటు, 18 శాతం జీఎస్టీ సొమ్మును చెల్లించాల్సి ఉందన్నారు. వాహన వివరాల కోసం 96035 17003, 73861 63994 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సెబ్‌ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు.

## మేఘమే ఛత్రమై.. అపురూప చిత్రమై..





రాజమహేంద్రవరంలో మేఘావృతమైన ఆకాశం

**రాజమహేంద్రవరం సిటీ:** ఉదయం అంతా ఉక్కపోత, మధ్యాహ్నం మండుటెండ కారణంగా విలవిల్లాడిన నగర ప్రజలు సాయంత్రం ఆకాశం మేఘావృమై ఈదురు వీయడంతో సేద తీరారు.

ఆకాశంలో మేఘాలు విభిన్న ఆకృతుల్లో దర్శనమిచ్చి నగర ప్రజల మనస్సులను దోచుకున్నాయి. వర్షం వస్తుందని ఆశగా ఎదురు చేసిన నగర ప్రజలకు మేఘాలు మాత్రం కను విందు చేశారు. దట్టమైన మేఘాలు ఆకాశంలో కమ్ముకుని రాజమహేంద్రవరం నగరాన్ని దుప్పటిలా కప్పేశాయి. శుక్రవారం సాయంత్రం రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై నుంచి ప్రయాణిస్తున్న వారిని వివిధ రంగుల్లో మేఘాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## 45 మంది విద్యార్థులకు ఉపకార వేతనం అందజేత



విద్యార్థులకు చెక్‌లు పంపిణీ చేసిన క్లబ్ సభ్యులు

**సీటీఆర్ఐ:** పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం చాలా సంతోషంగా ఉందని వాకర్స్ యోగ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అన్నారు. శుక్రవారం వాకర్స్ యోగ అండ్ లాఫింగ్ క్లబ్ (స్వచ్ఛంద సేవా సంస్థ) ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనందా గార్డెన్స్‌లో పాలసానపల్లి జగ్గారావు జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 మంది ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తూ వారు ఉన్నత విద్యావంతులుగా మారడానికి, మంచి ఉద్యోగ అవకాశాలు పొందడానికి సంస్థ తరఫున కృషి చేస్తున్నామన్నారు. దాతలు జి.నిర్మల్‌కుమార్ రూ.36 వేలు, క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవానీ రూ.25 వేలు, చల్లా శంకరరావు రూ.10 వేలు, విక్రమ్ ఎస్.జెన్నీరూ.11 వేలు, తమనంపూడి రామిరెడ్డి రూ.10 వేలు, డాక్టర్ కంటే వీరన్న చౌదరి రూ.10 వేలు, శ్రీమాన్ చిన్న వెంకన్న బాబు స్వామిజీ రూ.3 వేలు, ఆదిలక్ష్మి తన భర్త జ్ఞాపకార్థం రూ.5 వేలు పేద విద్యార్థుల ఉపకార వేతనం పంపిణీకి విద్యానిధికి విరాళంగా అందజేశారన్నారు. ప్రతి నెలా మాదిరిగానే 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికీ రూ. 500 చొప్పున రూ. 40 వేలు, 45 మంది విద్యార్థులకు రూ.3.50 లక్షలను ఉపకార వేతనంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఏబెల్ రాజబాబు, క్రాంతి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ కంటే వీరన్న చౌదరి పాల్గొన్నారు.